క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పైడి పద్మావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ప్రిన్సిపాల్‌గా పనిచేసిన వై.శ్రీనివాసరావు విజయనగరం జిల్లా గుర్ల జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందు కృషి చేస్తానన్నారు. అధ్యాపకుల సహకారంతో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా అధ్యాపక బృందం ఆమెకు ప్రత్యేకంగా అభినందించారు.

హిరమండలంలో..

హిరమండలం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కె.అప్పలరాము బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ ఇటీవల ఉద్యోగ విరమణ పొందారు. ఇక్కడ ప్రిన్సిపాల్ పోస్టు ఖాళీ అయింది. కళింగపట్నం కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసిన అప్పలరాము బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

రాముడు ఆదర్శప్రాయుడు



మాట్లాడుతున్న లజపతిరాయ్

సారవకోట: శ్రీరాముడుని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అంబేడ్కర్ విశ్వవిద్యాలయం విశ్రాంత వీసీ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. బుధవారం మండలంలోని కిన్నెరవాడలో గల పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో జ్యేష్ఠ పౌర్ణమి పురస్కరించుకుని అర్చకులు కొరపాక సిద్ధయ్య స్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సత్సంగం నిర్వహించారు. ఈ సందర్భంగా లజపతిరాయ్ మాట్లాడుతూ మన సనాతన ధర్మం చాలా గొప్పదని, ఆ ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతీ హిందువుడి బాధ్యతన్నారు. నికేతన్ స్వామి, బోయిన వెంకటరమణ, ఇప్పిలి రామకృష్ణ శర్మ, బైరి అచ్చన్న, కింతాడ దాలిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం కీలకం



మాట్లాడుతున్న అనందితా పాల్

నరసన్నపేట: పంటల్లో అధిక దిగుబడులు సాధించాలంటే రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులు కచ్చితంగా పాటించాలని రాజమండ్రి జాతీయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త అనందితా పాల్ అన్నారు. మండలంలోని గొట్టిపల్లిలో బుధవారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు హరి కుమార్, వై.సంధ్యారాణి మాట్లాడుతూ ఖరీఫ్ పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. వరిలో విత్తనాలు ఎంపిక, కలుపు నివారణ పద్ధతులు, ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అవ్వ రవీంద్రరెడ్డి, షణ్ముఖరెడ్డి, కుమార స్వామి, వీపీఏ హారిక, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఆస్తులు ధ్వంసం హేయం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి కార్యాలయాలు, ఆస్తులపై కూటమి మూకలు దాడులు చేసి ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పార్టీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు అగతమూడి నాగేశ్వరరావు అన్నారు. కొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల నుంచి వ్యతిరేకత రావడంతో ఇటువంటి డైవర్షన్ రాజకీయాలకు కూటమి నాయకులు పాల్పడుతున్నారన్నారు. పార్టీ నాయకుడు వసర రమేష్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు వనుము లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ దూలి అప్పన్న, పి.అశోక్, పాపారావు, దూలి నగేష్ పాల్గొన్నారు.

నాణ్యత తప్పనిసరి



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పోలాకి: మండలంలోని చెల్లాయివలస, గాతలవలస పంచాయతీల పరిధిలో పల్లె పండగ పేరుతో బుధవారం నిర్వహించిన రహదారుల ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పాల్గొన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సమక్షంలో కమ్మురిపేట, చింతువానిపేట రహదారులను ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, ప్రాధాన్యతాక్రమంలో పనులు చేపట్టాలని సూచించారు. డిప్యూటీ కలెక్టర్ లావణ్య, ఎంపీడీఓ రవికుమార్, తహసీల్దార్ శ్రీనివాసరావు, పలువురు నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

సమస్యల స్వాగతం!

- శిథిల భవనాలే దిక్కు
- పలు పాఠశాలల్లో అరకొర వసతులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు
- నేటి నుంచి పాఠశాలలు పునః ప్రారంభం

ఆమదాలవలస నియోజకవర్గంలోని పాఠశాలల వివరాలు..

మండలం	పాఠశాలలు
ఆమదాలవలస	99
సరుబుజ్జిలి	53
పొందూరు	70
బూర్జ	60

సరుబుజ్జిలి: గతంలో నాడు–నేడు ద్వారా చాలావరకు ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక మిగిలిన పాఠశాల భవనాల మరమ్మతులు, మౌలిక వసతులు గురించి పూర్తిగా పట్టించుకోవడం లేదు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు చదువుల సమయంలో తీవ్ర ఇబ్బందులు తప్పడంలేదు. ఆమదాలవలస నియోజకవర్గంలోని సరుబుజ్జిలి, బూర్జ, పొందూరు, ఆమదాలవలస మండలాల్లో 282 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలున్నాయి. వీటిలో దాదాపు 50 శాతం పాఠశాలలు శిథిలావస్థ దశలోనే ఉన్నాయి.

మరమ్మతులకు నోచుకోని వైనం..

నియోజకవర్గంలోని చాలా పాఠశాలలు మరమ్మతులకు నోచుకోకపోవడం వలన శిథిలావస్థకు చేరుకున్నాయి. ఆమదాలవలస మండలంలోని తమ్మయ్యపేట, చెవ్వాకులపేట, కంచరాపువానిపేట భవనాలు వృథాగా ఉన్నాయి. సరుబుజ్జిలి మండలంలోని మతలబుపేట, వీరభద్రాపురం, బురిడివలస, బురిడివలసకాలనీ, అతరాబాద్, బప్పడాం, రొట్టవలస పాఠశాలలు పూర్తిగా శిథిల దశకు చేరుకున్నాయి. రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం తరగతి గదులు పూర్తిగా పాడయ్యాయి.



పెచ్చులూడిన రొట్టవలస ప్రాథమిక పాఠశాల



కూలేందుకు సిద్ధంగా ఉన్న వీరభద్రాపురం పాఠశాల



శిథిలమైన రొట్టవలస హైస్కూల్ భవనం

వర్షం వస్తే భయం.. భయంగా..

శిథిలమైన పాఠశాల భవనాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ తరగతులకు హాజరవుతున్నారు. తరగతి గదుల పెచ్చులు పూర్తిగా ఊడిపోయి వర్షం వస్తే గది మొత్తం నీటితో నిండిపోతుంది. ఎప్పుడు ఏప్రమాదం ముంచుకొస్తుందోనని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సరుబుజ్జిలి మండలం బప్పడాం, బురిడివలస పాఠశాల భవనాలు పూర్తిగా వర్షానికి తడిచిముద్దవుతున్నాయి. భవనం పిల్లర్లు పూర్తిగా బీటలు వారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

పర్యవేక్షణ అవసరం



పాఠశాలల్లో వసతులు, సదుపాయాలు గురించి పూర్తిగా పర్యవేక్షణ ఉండడంలేదు. పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభం కానున్నాయి. ఇప్పటికే పాఠశాలలను తనిఖీ చేసి అవసరమైన చర్యలు చేపడితే బాగుండేది.

– మూదడ్ల భద్రమ్మ, రొట్టవలస, సరుబుజ్జిలి

పరిశీలన చేస్తాం



పాడుబడిన భవనాలు ఇప్పటికే పరిశీలన చేశాం. వాటి మరమ్మత్తులు, కొత్త భవనాల కోసం ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదికలు అందించాం. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వ్యవహరిస్తాం.

– డి.బాలరాజు, ఎంఈఓ, సరుబుజ్జిలి

పాత సమస్యలతో.. కొత్త విద్యా సంవత్సరం

- ఎక్కడ పనులు అక్కడే పెండింగ్
- గత ప్రభుత్వ హయాంలో రూ.69 కోట్లతో అభివృద్ధి పనులు
- కూటమిలో ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయని వైనం..!

నరసన్నపేట: కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఏడాదైనా ప్రభుత్వ స్కూల్స్‌లో పెండింగ్ పనులు పూర్తి చేయలేదు. గత ప్రభుత్వ కాలంలో నాడు–నేడు పథకం కింద రెండు విడతలుగా నరసన్నపేట నియోజకవర్గంలో స్కూల్స్ అభివృద్ధికి రూ.106 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంట్లో రూ.69 కోట్లు ఖర్చు చేసింది. ఈలోగా ఎన్నికలు రావడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. నాడు–నేడు పథకాన్ని పక్కన పెట్టింది. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనేక స్కూల్స్‌లో రెండో విడత పనులు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వేసవిలో నిధులు మంజూరు చేసి పెండింగ్ పనులు పూర్తిచేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశించారు. కూటమి ప్రభుత్వం పైసా కూడా నిధులు ఇవ్వలేదు. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఈ దశలోనే 2025–2026 విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. స్కూల్స్‌లో పెండింగ్ పనులపై కూటమి ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో విద్యార్థుల విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నరసన్నపేట మండలంలో లుకలాం, నరసన్నపేట బోర్డు, బాలికోన్నత పాఠశాల, తమ్మయ్యపేట స్కూల్ ఇలా పలుచోట్ల పనులు పెండింగ్‌లో ఉన్నాయి. తరగతి గదుల నిర్మాణ పనులు మధ్యలో నిలిచిపోయాయి. మడపాం, దేశవానిపేటల్లో ఆర్వో ప్లాంట్లు పనిచేయడం లేదు.



గత విద్యా సంవత్సరంలో నరసన్నపేట బోర్డు స్కూల్ వరండాలో తరగతుల నిర్వహణ(ఫైల్)



తమ్మయ్యపేట స్కూల్లో అర్ధంతరంగా నిలిచిన ప్రహరీ పనులు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పాఠశాలలు, ఖర్చు చేసిన నిధుల వివరాలు..

మండలం	పాఠశాలలు	అభివృద్ధి చేసిన పాఠశాలు	మంజూరైన నిధులు (కోట్లలో..)	ఖర్చున మొత్తం (కోట్లలో..)
నరసన్నపేట	81	69	రూ.28.90	రూ.20.20
సారవకోట	75	45	రూ.14.42	రూ.11
పోలాకి	97	63	రూ.27.50	రూ.14.40
జలుమూరు	77	59	రూ.35.77	రూ.23

సమస్యలతో సహవాసం



ఎస్సీ బాలుర హాస్టల్ భవనం

- శిథిలావస్థలో ఎస్సీ బాలుర హాస్టల్
- తలుపుల్లేని కిటికీలు
- స్నానాలకు, తాగునీటికి ఇబ్బందులు
- కరెంట్ పోతే చీకటిలో విద్యార్థులు
- పెచ్చులూడి పడుతున్న హాస్టల్ భవనం



పెచ్చులూడి పడుతున్న హాస్టల్ గది



రన్నింగ్ వాటర్ లేని హాస్టల్ మరుగుదొడ్లు

ఎల్.ఎన్.పేట: మండలంలోని లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల ప్రభుత్వ సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలుర హాస్టల్లో చదువుకుంటున్న విద్యార్థులకు సమస్యలు పీడిస్తున్నాయి. నాలుగున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన హాస్టల్ భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. ఇప్పటికే డైనింగ్ హాల్లో శ్లాబ్ శిథిలమైంది. మిగిలిన గదుల్లోనూ శ్లాబు నుంచి పెచ్చులూడి పడుతున్నాయి. హాస్టల్లో ఉండేందుకు విద్యార్థులు భయపడుతున్నారు. విద్యార్థులు ఉంటున్న గదుల కిటికీలకు తలుపులు లేకపోవటంతో దోమలు విజృంభిస్తున్నాయి. గాలితో కూడిన వర్షం పడితే గదుల్లోకి వర్షం నీరు వస్తుంది. హాస్టల్‌కు ఇన్వేటర్ లేకపోవటంతో రాత్రులు కరెంటు పోతే చీకటిలోనే ఉండాల్సి వస్తుంది. హాస్టల్లో నీటి అవసరాల కోసం బోరు, నుయ్యి లేకపోవటంతో నీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పుడో దశాబ్దాల క్రితం నిర్మించి బావి నీరు పూర్తిగా పాడవ్వటం, బోరులో ఇసుక, మట్టి చేరిపోవటంతో నీరు బయటకు రావటం లేదు. దీంతో పంచాయతీ పాలకులు హాస్టల్లో వేసిన మెగా వాటర్ రక్షిత తాగునీటి పథకం ట్యాప్ ఒక్కటే విద్యార్థుల నీటి అవసరాలకు దిక్కయింది. మెగా వాటర్ పథకం ద్వారా వచ్చే నీటితోనే వంట, తాగేందుకు, స్నానాలకు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. అధికారులు స్పందించి హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

పూర్తికాని ఉపాధ్యాయుల బదిలీలు..

ఎల్.ఎన్.పేట మండలంలో 38 ప్రాథమిక, 7 ప్రాథమికోన్నత, 5 జెడ్పీ, కేజీబీవీ పాఠశాలున్నాయి. వీటిలో సుమారు 2,300 మంది విద్యార్థులు చదువుతున్నారు. సెకండ్రీ గ్రేడ్ (ఎస్జీటీ) ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ పూర్తి కావల్సి ఉంది. ఎస్జీటీ బదిలీలు కౌన్సెలింగ్ దశలోనే ఉన్నాయి. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు వచ్చాయి. యూనిఫాంలు, బూట్లు ఇంకా రావల్సి ఉంది.

సమన్వయంతో పని చేయాలి


- ఎంపీపీ వాన గోపి



మాట్లాడుతున్న ఎంపీపీ వాన గోపి

జలుమూరు: సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ వాన గోపి అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయశాఖకు సంబంధించి ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులకు రాయితీపై అందిస్తున్న విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ కె.సురేష్‌కుమార్ తెలిపారు. వైద్య శాఖపై పర్యవేక్షణ అధికారి చిన్నరాజులు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పారిశుద్ధ్యంపై వివరించారు. దీనిపై పాగోడు సర్పంచ్ దామ మన్మథరావు మాట్లాడుతూ పంచాయతీలలో నిధులు లేవని ప్రభుత్వపరంగా నిధులు మంజూరైతే పారిశుద్ధ్యం పనులు పూర్తిస్థాయిలో చేయగలమన్నారు. రెవెన్యూ, విద్యుత్, గృహనిర్మాణ, వంశధార శాఖలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రమణమూర్తి, జెడ్పీటీసీ సభ్యుడు మెండ విజయశాంతి, తహసీల్దార్ జెన్ని రామారావు, ఎంపీడీఓ కె.అప్పలనాయుడు, పంచాయతీ విస్తరణ అధికారి ఉమామహేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


విద్యార్థినికి అభినందన



శ్రీవల్లిని అభినందిస్తున్న ధర్మాన కృష్ణదాస్

పోలాకి: విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. షైనింగ్‌స్టార్ పేరుతో ప్రభుత్వం గుర్తించి సత్కరించిన జిల్లాలోని విద్యార్థులందరికీ అభినందనలు తెలియజేశారు. ఆయన స్వగ్రామం మబగాంకు చెందిన వేదపండితుడు శృంగారం లక్ష్మీధనుంజయశర్మ కుమార్తె శ్రీవల్లి (షైనింగ్‌స్టార్)ని బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. తల్లిదండ్రులు సైతం పిల్లల కోరికలకు అనుగుణంగా విద్యతోపాటు, క్రీడలు, ఇతర సాంస్కృతిక అంశాల్లోనూ ప్రోత్సహించాలన్నారు. గత ప్రభుత్వంలో విద్యకు, విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన అనేక విషయాల్లో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మకమైన మార్పులను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

40 మందికి కంటి పరీక్షలు



నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆమదాలవలస: పట్టణంలోని టింపని స్కూల్ ఆవరణంలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పాఠశాల కరస్పాండెంట్ బి.వి.నారాయణరావు తెలిపారు. 20 మందికి శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖపట్నం ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. శంకర్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ కె.సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ



కొండపేటలో గోవిందరావును పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

బూర్జ: మండలంలోని పలు కుటుంబాలను వైఎస్సార్‌సీపీ ఆమదావలస నియోజకవర్గ సమన్వయకర్త చింతాడ రవి కుమార్ బుధవారం పరామర్శించారు. మదనాపురంలో కండాపు శ్రీనివాసరావుకు ఇటీవల మేజర్ సర్జరీ జరిగింది. ఇదే గ్రామానికి చెందిన పప్పల వెంకటరావు కంటి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. కొండపేటలో వావిలపల్లి గోవిందరావుకు శస్త్ర చికిత్స జరిగింది. చిన్నకురిమిపేటలో పసుకు గంగాధరరావు కంటి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. పీఎల్‌దేవిపేటలో దాసరి రామకృష్ణ కుమారుడు సత్యనారాయణకు సర్జరీ అయింది. నీలాదేవిపురంలో మంగి సింహాచలంకు గుండె సంబంధిత శస్త్ర చికిత్స జరిగింది. ఇదే గ్రామంలో పిసిని భాస్కరరావు, కింజరాపు కృష్ణకు గాయాలు కావడంతో వారిని రవికుమార్ పరామర్శించి వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో పార్టీ నాయకులు ఖండాపు గోవిందరావు, రామచంద్ర పాడి, గండేటి రాము, జల్లు ఆదినారాయణ, మజ్జి నర్సింగరావు, బి.వి.నాయుడు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నరసన్నపేట: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు కేంద్రాల్లో ఖాళీల భర్తీకి అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీఓ శోభారాణి బుధవారం తెలిపారు. నరసన్నపేట మండలం కామ్వేరిపేట కేంద్రంలో ఆయా (బీసీ–సీ), పోలాకి మండలం మునసబుపేట కేంద్రంలో ఆయా (బీసీ–బీ), పోలాకి మండలం అంబీరుపెంటలో అంగన్‌వాడీ కార్యకర్త (బీసీ–సీ) పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తులు గురువారం నుంచి ఈ నెల 20వ తేదీలోగా సంబంధిత ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలన్నారు.


దరఖాస్తు చేసుకోవాలి

పొందూరు: మండలంలోని వావిలపల్లిపేట వద్ద గల ఏపీ మోడల్ స్కూల్‌లో 7, 8, 9వ తరగతుల్లో మిగులు సీట్లును భర్తీ చేయనున్నారు. మిగులు సీట్లుకు సంబంధించి ఈ నెల 18వ తేదీలోగా ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా మనోహరి

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సాధారణ బదిలీల్లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌గా ఎల్.మనోహరి బుధవారం విధుల్లో చేరారు. ఇక్కడ విధులు నిర్వహించిన పి.సునీతను సోంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బదిలీ అయ్యారు. కోటబొమ్మాళి నుంచి మనోహరి ఇక్కడకు వచ్చారు.

శుభ కార్యక్రమాలకు విరామం



సుబ్రహ్మణ్య శర్మ

సరుబుజ్జిలి: గురుపౌర్ణమి, ఆషాఢ మాసం కారణంగా వివాహా, ఇతర శుభకార్యక్రమాలకు 48 రోజులపాటు విరామం ఉంటుందని కొండవలస గ్రామం శారదా కామేశ్వరమ్మజ్యోతిష్యాలయం వ్యవస్థాపకులు పంచాంగకర్త మావుడూరి సుబ్రహ్మణ్యశర్మ బుధవారం తెలిపారు. జ్యేష్ఠ మాసంలో మూఢమి రాకపోతే మరో 15 రోజులు వివాహాది శుభకార్యక్రమాలు జరిగేవని వెల్లడించారు. జూలై 26 నుంచి శుభకార్యక్రమాలు నిర్వహించుకోవచ్చన్నారు. శుభకార్యక్రమాలు అధికంగా జూలై 26 నుంచి నవంబర్ 27వ తేదీ వరకు ఉంటాయన్నారు.

ఆలయ నిర్మాణం నిలుపుదల చేయాలి



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వంశధార ఏఈ

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్–1 ఆర్ ఆర్ కాలనీకి అనుకొని ఉన్న వంశధార వరద గట్టుపై చేపడుతున్న ఆలయ నిర్మాణ పనులను నిలుపుదల చేయాలని తహసీల్దార్ కె.బాలకృష్ణకు వంశధార ఏఈ బుధవారం ఫిర్యాదు చేశారు. 2023లో ఆలయ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని మండలంలోని నీలకంఠాపురం గ్రామానికి చెందిన జి.రమేష్ వంశధార అధికారులకు ఫిర్యాదు చేశారని ఏఈ అన్నారు. ఆ ఫిర్యాదు మేరకు గతంలో అధికారులు పరిశీలించి పనులు నిలుపుదల చేశారన్నారు. ప్రస్తుతం పనులు మళ్లీ ప్రారంభించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. వరద గట్టుపై కాకుండా ఇతర ప్రాంతంలో ఆలయ నిర్మాణం చేపట్టాలన్నారు. ఆలయ నిర్మాణానికి తాము వ్యతిరేకం కాదన్నారు.